క్లుప్తంగా

జీపీఆర్ హౌసింగ్ అధినేత పున్నారావుకు సతీ వియోగం



సరళకుమారి (ఫైల్)

పాత గుంటూరు: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ జీపీఆర్ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత, కమ్మజన సేవా సమితి పాలక మండలి సభ్యుడు ఘంటా పున్నారావు భార్య సరళకుమారి (65) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆదివారం మరణించారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు నవభారత్ నగర్ 1/3వ లైనులోని వరండాస్ అపార్ట్‌మెంటు నుంచి భౌతికకాయం బయలుదేరి, స్తంభాల గరువు మహాప్రస్థానంలో అంత్యక్రియలు జరుగుతాయని పున్నారావు తెలిపారు.

పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం, జ్ఞానం

పెదనందిపాడు: పుస్తక పఠనంలో మానసిక ఉల్లాసం, ప్రాపంచిక జ్ఞానం కలుగుతుందని, ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్ రావు తెలిపారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి యువత సెల్ ఫోన్లు, టీవీలు, ఇంటర్నెట్, కంప్యూటర్ల మోజులో పడి పుస్తక పఠనంపై నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా పుస్తకాలు మంచి నేస్తాలుగా ఉపయోగపడతాయన్నారు. ఖాళీ సమయాల్లో చదవడం వల్ల మానసిక వికాసంతో పాటు విజ్ఞానం కలుగుతుందని ఆయన తెలిపారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు పి. సుభాషిణి, విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, గుగ్గిలం సాయిబాబు, అన్నలదాసు విజేంద్ర రావు, సుబ్బారావు, మంజుల, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్‌ఐ శ్రీనివాసరావు

పెదనందిపాడు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి బంగారు నగల్ని దోచుకెళ్లిన ఘటన రాజుపాలెంలో జరిగింది. పెదనందిపాడు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన నిడుమోలు పోతురాజు, పద్మావతి దంపతులు వ్యవసాయ పనుల నిమిత్తం శనివారం మధ్యాహ్నం పొలానికి వెళ్లారు. ఈ సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి అక్కడే ఉన్న తాళాలతో బీరువా తలుపులు తెరిచారు. అందులో ఉన్న 40 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించినట్లు ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

చేబ్రోలు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురవ్వడంతో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన చేబ్రోలు కొమ్మమూరు బ్రిడ్జి వద్ద ఆదివారం జరిగింది. పొన్నూరు మండలం కట్టెంపూడి గ్రామానికి చెందిన కె. సునీత దంపతులు ద్విచక్ర వాహనంపై గుంటూరు నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. చేబ్రోలు కొమ్మమూరు బ్రిడ్జి వద్ద బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో సునీతకు కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నాలుగు షాపులు దగ్ధం

పెదకాకాని: స్థానిక బస్టాండ్ ఆవరణలో షాపులకు మంటలు వ్యాపించడంతో కాలి బూడిదయ్యాయి. ఆదివారం తెల్లవారుజామున ఒక దుకాణంలో ప్రారంభమైన మంటలు నాలుగు షాపులకు వ్యాపించాయి. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకుని గుంటూరు అగ్నిమాపకశాఖ కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి సిబ్బంది చేరుకుని మంటల్ని పూర్తిగా అదుపులోకి తీసుకు వచ్చారు. అప్పటికే పఠాన్ ముంతాజ్, సయ్యద్ జాన్‌సైదా, కోగంటి కనకమ్మ, ఎస్‌కే షకీలాకు చెందిన ఫ్యాన్సీ సామానులు, బొమ్మలు అమ్మే షాపులు అగ్నికి ఆహుతయ్యాయి. తెల్లవారుజామున వీచిన గాలులకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు.

సిండి'కేటు'గా తాగునీటి దోపిడీ

- నగరపాలక సంస్థ పరిధిలో ట్యాంకర్ల ద్వారా అమ్మకం
- కమర్షియల్, భవన నిర్మాణాలకు జోరుగా సరఫరా
- ముడుపులు వస్తుండటంతో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు





గుంటూరు నగరంలో భవన నిర్మాణానికి వినియోగిస్తున్న నగరపాలక సంస్థ ట్యాంకర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అధికారులు తాగునీటిని యథేచ్ఛగా అమ్ముకుంటున్నారు. ఫిల్టర్ చేసిన నీటిని కమర్షియల్ సంస్థలు, అపార్ట్‌మెంట్లు, భవన నిర్మాణాలు, హోటళ్లకు పంపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి ట్యాంకర్ల నిర్వాహకులు, నగరపాలక సంస్థ కాంట్రాక్ట్ సిబ్బంది నుంచి ఇంజినీరింగ్ అధికారులకు ముడుపులు అందడంతో నీటి దోపిడీని పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు గట్టిగా చర్యలు తీసుకుంటే వేసవిలో టెయిల్ ఎండ్ పాయింట్(నీరు అందని ప్రాంతాలు) నీటి కష్టాలు తప్పుతాయి.

వేసవి వస్తే మరింత దోపిడీ

గుంటూరు నగరంలో 42 రిజర్వాయర్లకు కృష్ణా నది నుంచి తాడేపల్లి మీదుగా ప్రతి రోజూ 150 ఎంఎల్‌డీ నీరు సరఫరా అవుతోంది. వేసవిలో అప్పుడప్పుడు ఉత్పన్నమయ్యే కరెంట్ కోతల వల్ల కొంతమేర డ్రాప్ అయ్యే అవకాశం ఉంది. దీంతో రిజర్వాయర్ పరిధిలో టెయిల్ ఎండ్ ప్రాంతాలకు నీరు అందదు. ఈ సమయంలో అధికారులు ట్యాంకుల ద్వారా పంపిస్తుంటారు. వేసవిలో ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్ల నిర్వాహణకు టెండర్లు పిలుస్తుంటారు. ఇదే కాంట్రాక్టర్లకు, అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. టెయిల్ ఎండ్ ప్రాంతాలకు నీరు ఇవ్వడం దేవుడికి ఎరుక...తమ జేబులు నింపుకునేందుకు అమ్మేసుకుంటున్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అధికారికంగా డివైడర్ల మీద మొక్కలు నీరు, విలీన ప్రాంతాలకు నీరు పంపించేందుకు 10 ట్యాంకర్ల పైగా ఉంటే అనధికారికంగా 13 ట్యాంకర్లు ఉన్నాయంటే దోపిడీ అర్థమవుతుంది. ప్రతి ట్యాంకర్ రోజుకు 10 నుంచి 20 ట్రిప్పులు తిప్పుకుంటున్నారు.



ప్రైవేటు కాలేజీకి పోసేందుకు వచ్చిన నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకర్

కాసులు కురిపిసున్న నీళ్లు

2015లో అప్పటి కమిషనర్ టెయిల్ ఎండ్ ప్రాంతాలకు, అత్యవసరంగా నీరు కావాల్సిన వారి కోసం డయల్ యువర్ ట్యాంకర్ విధానం అమలులోకి తీసుకువచ్చారు. 4వేల (ట్రాక్టర్) లీటర్ల ట్యాంకర్‌కు రూ.250, 12వేల (లారీ) లీటర్ల ట్యాంకర్‌కు రూ.500 చొప్పున రుసుం వసూలు చేసేవారు. కాలక్రమేణా ఈ విధానం కొంత మందికి కాసులు కురిపిస్తుందన్న విషయం తెలియడంతో 2018 తరువాత ఆపేశారు. అయినప్పటికీ 4 కేఎల్ (కిలో లీటర్) ట్రాక్టర్ నీటిని రూ.700 నుంచి రూ. 1,000 వరకు, 12 కేఎల్ ట్యాంకర్‌ను రూ.2వేల నుంచి రూ. 3 వేల వరకు అమ్ముకుంటున్నారు. గత నెలలో వాటర్ పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనులు ఆలస్యం కావడంతో టూ టౌన్‌లో సమస్య ఉత్పన్నమైంది. ఆ సమయంలో ట్యాంకర్ల దోపిడీ పెచ్చుమీరిపోయిందనే చెప్పుకోవచ్చు. నీటి అవసరం కావడంతో ట్యాంకర్ల నిర్వాహకులు ఎంత అడిగితే అంత ఇచ్చుకుని తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజాప్రతినిధుల పేరుతో దోపిడీ

కొద్ది నెలల కిందట స్తంభాల గరువు, హెచ్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్ల వద్ద ట్యాంకర్ల దోపిడీ పెరిగిపోయిందని, తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. సదరు రిజర్వాయర్ల వద్ద ఆకస్మిక తనిఖీ చేపట్టిన కమిషనర్ గట్టిగా ప్రశ్నించడంతో అధికారులు నీళ్లు నమిలారు. ప్రజాప్రతినిధులు చెప్పకపోయినప్పటికీ వారు అడిగినట్లు పేర్లతో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్ట్ ఇంజినీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లు సిండికేటుగా నీటిని దోచుకుంటున్నట్లు సమాచారం. ఈ విషయంపై కమిషనర్ దృష్టి సారించిన విషయం తెలుసుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు కొన్నాళ్లు నీటి దోపిడీని ఆపేశారు. ప్రస్తుతం యథావిధిగానే కొనసాగుతుందని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే చర్యలు

సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద టెయిల్ ఎండ్ పాయింట్లకు(నీరు అందని ప్రాంతాలకు) ట్యాంకర్లను ఈఈలు (ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్) వారీగా ఏర్పాటు చేసుకున్నారు. ట్యాంకర్ల నిర్వాహణకు సంబంధించి పక్కాగా రికార్డ్ మెయింటెన్ చేస్తున్నాం. ఎక్కడైనా దుర్వినియోగం జరిగినట్లు తెలిస్తే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

– పీవీకే భాస్కర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, నగరపాలక సంస్థ

ఆంగ్ల భాషా నైపుణ్యంతో భవిష్యత్



శిక్షణార్థులతో కిరణ్‌కుమార్, అధ్యాపక బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే ఆంగ్లభాషా నైపుణ్యాల్ని పెంచుకోవాలని ఎంఎస్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ సెంటర్ డైరెక్టర్ జె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం వరల్డ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే సందర్భంగా బ్రాడీపేట మూడో లైనులోని సెంటర్‌లో విద్యార్థులకు ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంచుకోవడంపై వివిధ కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏ రంగంలో రాణించాలన్నా పాఠశాల, కళాశాల విద్యతో పాటు అడ్వాన్స్‌డ్ స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, పబ్లిక్ స్పీకింగ్ స్కిల్స్ వంటి ముఖ్యమైన నైపుణ్యాలు ఎంతో అవసరమని తెలిపారు. విద్యార్థి దశలోనే స్టేజీ ఫియర్ పోగొట్టుకొని, ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడడంతో పాటు, స్కిల్స్ మెరుగుపరుచుకుని ఎటువంటి ఇంటర్వ్యూ అయిన సులభంగా క్లియర్ చేయాలనే ముఖ్య ఉద్దేశంతో విద్యార్థుల కోసం ప్రత్యేక కోర్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన అనుభవజ్ఞులైన అధ్యాపకుల గైడెన్స్‌తో ఇంగ్లిష్‌ను అనర్గళంగా మాట్లాడాలనే కలను సాకారం చేస్తామని వివరించారు. తెలుగు మీడియం నుంచి వచ్చిన విద్యార్థులతో పాటు గృహిణులకు సైతం శిక్షణ తరగతుల్ని నిర్వహించడం ద్వారా ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంపొందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఎన్టీఆర్ స్టేడియాన్ని తీర్చిదిద్దుతాం

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు నగరానికే తలమానికంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతామని శాసనమండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఆదివారం స్టేడియంలో అభివృద్ధి పనుల్ని ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజలు, అభివృద్ధి కమిటీ సభ్యులతో పనులపై చర్చించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ క్రీడా ప్రాంగణాలు పిల్లలు, క్రీడాకారులతో కళకళలాడుతూ ఉండాలనే రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆశయాల మేరకు గత ఏడాది నుంచి స్టేడియంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఇటీవల పూర్తి చేసిన బాస్కెట్ బాల్ కోర్టులో రాష్ట్ర పోటీల్ని సైతం విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల ఐదో తేదీలోపు వాకింగ్ ట్రాక్, ఫుట్‌పాత్ పనుల్ని పూర్తి చేయాలని సిబ్బందికి చెప్పారు. జీతాల గురించి స్టేడియం కోచ్‌లు అప్పిరెడ్డికి వినతిపత్రం అందజేయగా అప్పటికప్పుడు స్పందించి జీఎంసీ డెప్యూటీ కమిషనర్ చెరువు శ్రీనివాస్‌ను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. స్టేడియం అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ గడచిన ఏడాదిలో ఎన్నడూలేని అభివృద్ధి పనుల్ని ఎమ్మెల్సీ అప్పిరెడ్డి సహకారంతో పూర్తి చేశామని చెప్పారు. రానున్న కాలంలో జిమ్‌తోపాటు అనేక ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో షేక్ లాల్ వజీర్, చెలికాని సీతారామయ్య, కార్పొరేటర్లు ఈచంపాటి ఆచారి, గోపి శ్రీనివాస్, మోతుకూరి వెంకట రత్నం పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు



నృత్యం చేస్తున్న అరుణరేఖ

పాత గుంటూరు: అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో మహా మంజీర నాదం పేరుతో నృత్యోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నృత్య శాఖాధిపతి డాక్టర్ కొండపర్తి వనజ ఉదయ్‌కు పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారాన్ని సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం అందించి ఘనంగా సత్కరించారు. ముంబైకి చెందిన వారణాసి అరుణ రేఖకు నాట్య కళా తిలకం అవార్డు, గద్వాల్‌కు చెందిన తెలుగు ప్రవల్లిక, హైదరాబాద్‌కు చెందిన శృతి భాస్కర్‌కు యువ కళారత్న పురస్కారంతో సత్కరించారు. అనంతరం అవార్డు గ్రహీతల నృత్య ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆనంద పరవశుల్ని చేసింది. కార్యక్రమాన్ని సంస్థ కోశాధికారి వెంకటగిరి నాగలక్ష్మి, కాజ శ్యామ సుందరరావు పర్యవేక్షించారు.

నిరు పేదలకు సాయం అభినందనీయం



దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచి స్వరూపరాణి

పెదకాకాని: దాతల సహకారంతో నిరు పేదలకు సాయం చేయడం అభినందనీయమని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి తెలిపారు. పెదకాకాని బాజీనగర్ గోండు కాలనీలోని పేదలకు స్కోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుస్తుల పంపిణీ చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ పి. రాజశేఖర్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సర్పంచి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే విధంగా వీసీ రాజశేఖర్ పేదలకు సహాయ, సహకారాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. మనకు ఉన్నంతలో సాటి వారికి సాయం చేయాలనే గొప్ప ఆలోచన మంచి మనసున్న వారికే సాధ్యపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో స్కోప్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ డి.కొండలరావు, వికాస ప్రెసిడెంట్ అనిల్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ ప్రెసిడెంట్ కోటేశ్వరావు, డాక్టర్ వేణు, స్థానిక వార్డు సచివాలయాల కన్వీనర్ ఎస్‌కే ఆరిఫ్ పాల్గొన్నారు.

బుడంపాడు పీఏసీఎస్ అధ్యక్షుడిగా మీరజ్ కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న మీరజ్ కుమార్

గుంటూరు రూరల్: బుడంపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. స్థానిక సొసైటీలో అధ్యక్షుడిగా ద్రాక్షారాం మీరజ్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఏటుకూరు రోడ్డు నుంచి బుడంపాడు వరకు ద్విచక్ర వాహనాలతో సొసైటీ వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం అనంతరం అధ్యక్షుడు మీరజ్‌కుమార్ మాట్లాడుతూ సంఘం నుంచి రైతులకు సకాలంలో రుణాలు, ఎరువుల్ని అందించనున్నట్లు చెప్పారు. తనకు అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే సుచరిత, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బూరుగడ్డ జయశ్రీ , బాదినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ సీఈవో సురేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బోరుగడ్డ రజనీకాంత్, పోతుల రాము, ఏటుకూరి విజయసారథి, నిశంకరరావు నాగేశ్వరరావు, పి. సురేష్‌బాబు, దారం అశోక్‌కుమార్ యాదవ్, ఏటుకూరి జయప్రకాష్, ఏటుకూరి రాజేష్, ఏటుకూరి బాలస్వామి, ఏటుకూరి ప్రసాద్, హుస్సేన్, సుబ్బారావు, రంగా, లలిత్‌బాబు పాల్గొన్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం పాలకవర్గ సభ్యులు ఎమ్మెల్యే సుచరితను ఆమె కార్యాలయంలో కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాఫిక్ తంటాలు షరా మామూలే !

- ఈస్ట్ పరిధిలో మరింత దారుణం
- పగటి పూటే రోడ్లపై దర్శనమిస్తున్న భారీ వాహనాలు
- రోడ్లపై విచక్షణారహితంగా పార్కింగ్



మధ్యాహ్నం సమయంలో పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో ట్రాన్స్‌పోర్ట్ వెహికల్



ఆర్కేటీ సెంటర్‌లో షాపింగ్ మాల్ ఎదుట పార్కింగ్ చేసిన వాహనాలు

పట్నంబజారు: నగరంలో ట్రాఫిక్ తంటాలు తప్పడం లేదు. నానాటికీ తీవ్రమవుతూనే ఉన్నాయి. పోలీసులు అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకోవడంతో ప్రజలకు తంటాలు తప్పడం లేదు. నగరంలో సుమారు 20వేలకు పైగా ఆటోలు, 3లక్షలపై బైకులు, 46వేల కార్లు, జీపులు ఉన్నాయి. నిత్యం నగరంలో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.

అడ్డదిడ్డంగా ఆటోల పార్కింగ్

ఆర్టీసీ బస్టాండ్, ఓల్డ్ క్లబ్ రోడ్డు చివర, నందివెలుగు రోడ్డు బస్టాండ్ వెనుక, బ్రహ్మానందరెడ్డి స్టేడియం, రాధాకృష్ణా థియేటర్ సెంటర్ (ఆర్కేటీ), హిమని కూల్‌డ్రింక్ సెంటర్, రైల్వేస్టేషన్, నాజ్‌సెంటర్, శంకర్ విలాస్, ప్రభుత్వాసుపత్రితో ప్రాంతాల్లో ఆటోల్ని అడ్డదిడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో అయితే ఇక చెప్పాల్సిన పనిలేదు. వన్ వే ఉన్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోకుండా ఆటోలు, సిటీ బస్సులు రోడ్డుపై అడ్డంగా నిలపడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ రహదారిపై వాహనాల్ని రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటంతో అంబులెన్స్‌లు కూడా వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. పట్నంబజారు, ఏలూరు బజారు, పూలమార్కెట్ సెంటర్, పండ్ల వ్యాపారాల సముదాయాలు, చేపల మార్కెట్ ప్రాంతాల్లో సరుకు దించేందుకు వచ్చిన వాహనాలు రోడ్ల పైనే అడ్డంగా నిలిపివేయడంతో అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడింది. సాయంత్రం పూట ఈస్ట్ ట్రాఫిక్ స్టేషన్ పక్కన, బస్టాండ్ వద్ద నేరుగా ప్రైవేట్ బస్సుల్ని రోడ్డుపై నిలిపేస్తున్నారు. ఇదేమని అధికారుల్ని అడిగితే.. నోటీసులు ఇచ్చామని చెప్పి చేతులు దులుపుకుంటున్నారే తప్పా సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదు.

మళ్లీ భారీ వాహనాలు

నగరంలో గతంలో భారీ వాహనాలపై సాక్షిలో కథనం ప్రచురితమైన పరిస్థితుల్లో ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. డీఎస్పీ రమణకుమార్, సీఐ వీరానాయక్, 18 మంది హోంగార్డులను వీఆర్‌కు పంపారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నగరంలో భారీ వాహనాలు రాకూడదనే నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీసుల అధికారులు ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ భారీ వాహనాలు నగరంలో తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. వీటితో పాటు మార్కెట్ సమీపంలో ఉన్న అవుట్ పోస్ట్ అలంకారప్రాయంగా మారింది.

పార్కింగ్ పరేషాన్

నగరంలో ట్రాఫిక్ సమస్య పార్కింగ్ ప్రధానంగా నిలుస్తోంది. ఓల్డ్ క్లబ్ రోడ్డు, 60 అడుగుల రోడ్డుల్లో రోడ్లు పైనే కార్లు నిలిపేస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువైయ్యాడు. ఆర్కేటీ సెంటర్‌లో ఒక షాపింగ్ మాల్‌కు సంబంధించి వాహనాల్ని యథేచ్ఛగా రోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నా పోలీసు అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నాజ్‌సెంటర్ మాత్రం ఒక షాపింగ్‌మాల్ యాజమాన్యం వాహనాలకు టోకెన్లు పెడుతున్న పరిస్థితుల్లో, బయట పార్కింగ్ చేస్తే 'నో పార్కింగ్' కింద పోలీసులు జరిమానాలు విధిస్తున్నా రు. అక్కడో న్యాయం.. ఇక్కడో న్యాయమా? అని వాహనదారులు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

భారీ వాహనాలకు అనుమతి లేదు



ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నగరంలో భారీ వాహనాలకు అనుమతి లేదు. ట్రాన్స్‌పోర్ట్, పార్సిల్ వెహికల్ ఏదైనా అనుమతి లేనట్టే. రోడ్లపై పార్కింగ్ చేస్తున్న అంశాన్ని పరిశీలించాం. ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. కచ్చితంగా రోడ్లపై పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. ఆటోలు సైతం ఇష్టానుసారంగా నిలపకుండా చర్యలు చేపడతాం.

–ఏ. శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ, క్రైం, ట్రాఫిక్ ఇన్‌చార్జి

వ్యాపారం పేరుతో మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: దీపారాధన వత్తులు వ్యాపారం పేరుతో మోసగించిన ఇద్దరు మహిళలపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పోస్టల్ కాలనీకి చెందిన శైలజ మధ్యవర్తిగా వ్యవహరిస్తూ హైదరాబాదులోని లోకేశ్వరి నుంచి దీపారాధన వత్తులు తయారు చేయించే వ్యాపారం ప్రారంభించింది. శ్రీనగర్‌కు చెందిన గరికపాటి కృష్ణవేణి, సంధ్యారాణి, పళని, ఎం.సంధ్యారాణిలకు రూ. 40 వేలు విలువ చేసే వత్తులు తయారు చేసే మిషన్‌ను రూ. 1,60,000కు విక్రయించారు. వత్తులు తయారు చేస్తే తాము కొనుగోలు చేస్తామని శైలజ నలుగురిని నమ్మించింది. మూడు నెలల పాటు వత్తులు తీసుకుని డబ్బులు చెల్లించలేదు. అనంతరం శైలజ వ్యాపారం పూర్తిగా ఆపి వేసింది. మోసపోయిన నలుగురు మహిళలు ఆదివారం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పెదకాకాని: రెండు బైక్‌లు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన నంబూరులో జరిగింది. గ్రామానికి చెందిన నంబూరు ప్రశాంత్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 21న బైక్‌పై గ్రామంలోని మెడికల్ షాపునకు వెళ్లి తిరిగి ఇంటికి బయలు దేరాడు. మార్గం మధ్యలో ఒకే బైక్‌పై ముగ్గురు ప్రయాణిస్తూ నిర్లక్ష్యంగా, అతి వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. ప్రశాంత్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలైన ఘటన పాత మద్రాసు రోడ్డుపై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన కృష్ణయ్య మిరపకాయలను ఆటోలో గుంటూరుకు తీసుకువెళ్లి, విక్రయించుకుని తిరిగి వస్తున్న సమయంలో వట్టిచెరుకూరు మండలం కుర్నూతల సమీపంలో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీలు కొట్టుకుంటూ పక్కనున్న పొలాల్లోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గురవయ్యతో పాటు రైతు కృష్ణయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

పట్నంబజార్: ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాచర్ల ప్రాంతానికి చెందిన షేక్ మదార్ (19) తల్లిదండ్రులు సెల్‌ఫోన్ ఇవ్వలేదనే కారణంతో ఈ నెల ఒకటో తేదీన గడ్డిమందు తాగాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.